

# వైకుంఠయాత్ర

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

### 32

**"మళ్ళీ పట్టుకొచ్చారా?"** పూర్తిగా స్పృహ రాగనే అడిగాడు శివాజీ ఎదురుగా నిలబడి వున్న కుమారస్వామిని చూస్తూ.

"అవును నువ్వు చచ్చేదాకా నిన్ను తీసుకొస్తూనే వుంటారు మా వాళ్ళు. నిన్ను కంగ్రాట్యులేట్ చేయడానికి వచ్చారు."

"దేనికి కంగ్రాట్స్?"

"క్రితంసారి నీకు మృత్యువు తప్పినందుకు. ఈసారి మాత్రం ఎలాంటి పొరబాటు జరగకుండా నువ్వు మరణించి తీరుతావు."

"పొడుస్తున్నారా, లేక కాలుస్తున్నారా?" భయంగా అడిగాడు శివాజీ.

"ఆ రెండూ కాదు. నీది ఏక్సిడెంట్ డెత్‌గా ప్రూవ్ చేయదలిచాం."

"కారా? బస్సా? లారీనా?"

"అవి ఏమీ కావు" అని, తన మనుషులతో "పదండి" అన్నాడు కుమారస్వామి.

శివాజీ నోటికి టేప్ అంటించాడు తాతాచారి. కాళ్ళూ చేతులు కట్టేసే వున్నాయి. అతన్ని ముగ్గురు మనుషులు ఎత్తి ఒక దుప్పటిలో పడుకోబెట్టారు. ఆ దుప్పటి అంచులను పట్టుకుని బయటకు నడిచారు. ఒక అపార్ట్‌మెంట్‌లోని గదిలో నుంచి తనను బయటికి తీసుకు వచ్చారని గ్రహించాడు శివాజీ. పొడవైన కారిడార్‌ని, కారిడార్‌లో తలుపులకు వున్న నంబర్లు చూసి.

అర్ధరాత్రి కాబట్టి నిర్మానుష్యంగా వుంది.

అందరూ లిఫ్ట్‌లోకి వెళ్ళి టాప్ ఫ్లోర్ బటన్ నొక్కారు. శివాజీ గుండె దడదడ కొట్టుకోసాగింది జరగబోయేది తలచుకుంటే. పై అంతస్తులో నుంచి తోసి చంపుతారు బహుశ. అంత ఎత్తునుంచి కిందపడి తల చితికి చావడం... అబ్బ దారుణం కాలో, చెయ్యో విరిగి బతికినా ఆ జీవితం దారుణమే.

లిఫ్టు నాలుగో అంతస్థులో ఆగింది. అందులోనుంచి బయటికి తొంగిచూసి, తర్వాత బయటకి నడిచారంతా.

మెట్లెక్కి టెర్రస్‌లోకి చేరుకున్నారు. చుట్టుపక్కల కూడా అపార్టుమెంట్స్ వున్నాయి చల్లటిగాలి రివ్వున వీస్తోంది.

కుమారస్వామి  స్వయంగా రావడానికి కారణం ఈసారి అంతా విజయవంతంగా జరగాలని, అది దగ్గర వుండి చూడాలని.

శివాజీని పిట్టగోడ దగ్గరకి తీసుకువెళ్ళారు. కిందకి తొంగి చూశాడు శివాజీ. రోడ్డుమీద వీధి దీపాలు వెలుగుతున్నాయి.

"నీ ఏక్సిడెంటల్ డెత్ లేదా సూసైడ్ అనుకోవాలి ప్రజలు అసలు నీ మొహమే గుర్తుపట్టనంతగా పచ్చడైతే నీ ఐడెంటిటీనే తెలియదు ఎవరికీ. 'గుర్తు తెలియని శవం'గా నీ కేసు క్లోజ్ అవుతుంది.

శివాజీ నోటికి వున్న ప్లాస్టర్ తీశాడు రామూ.

"ఆఖరుగా నువ్వు చెప్పుకునేది ఏదైనా వుందా?" అడిగాడు కుమారస్వామి దర్జాగా చూస్తూ.

"ఉంది. నేను పవన్‌ని కాదు. నా పేరు శివాజీ. మీరు యింకొకసారి పొరబడ్డారు."

పకపకా నవ్వాడు కుమారస్వామి.

"ఇంకా అది వదల్లేదన్నమాట."

"ఒకవేళ నా శవం గుర్తుపట్టలేనంతగా చితికిపోతే, బొంబాయిలోని మా అమ్మ పావనికి ఈ సంగతి తెలియచేయండి. ప్లీజ్"

"అలాగేలే."

"దీనికన్నా ఎత్తయిన బిల్డింగ్స్ అనేకం వుండగా, దీనిమీదకే ఎందుకు తీసుకు వచ్చినట్లు?" అడిగాడు శివాజీ.

నవ్వాడు కుమారస్వామి.

"ఇవే చావు తెలివితేటలు అంటే. ఈ బిల్డింగ్‌లో నీ ప్రియురాలు వుంటోంది.. నువ్వు ఇక్కడ ఆత్మహత్య చేసుకుంటే ప్రేమ విఫలం అనుకుంటారు అందరూ"

"అద్రిజా...? ఓ... ఆ అమ్మాయా?"

శివాజీ చేతికి, కాళ్ళకి వున్న కట్లు విప్పాడు తాతాచారి. అతను పెనుగులాడకుండా గట్టిగా పట్టుకున్నారు రాములు, సూరి. ముగ్గురు కలిసి అతన్ని పైకెత్తారు.

"దేవుడిని స్మరించుకో" నవ్వాడు కుమారస్వామి చేతిలో వున్న విస్కీ గ్లాసు ఖాళీ చేస్తూ.

నిర్మానుష్యంగా వుంది కింద రోడ్డు. చటుక్కున శివాజీని పైనుంచి  కిందకి తోసేశారు. కెవ్వున కేక వేస్తూ అతను కిందపడిపోయాడు.

వేగంగా రోడ్డు మీదకి పడుతున్న శివాజీ కళ్ళకి కనిపిస్తోంది క్షణక్షణానికి దగ్గరవుతున్న రోడ్డు భయంతో కళ్ళు మూసుకున్నాడు. కింద రెండో అంతస్తు దగ్గర టెలిఫోన్ వైర్ అడ్డు తగిలి దానిమీద పడ్డాడు శివాజీ. అతని బరువుకి అది తెగిపోయింది.

అలాగే మొదటి అంతస్తు బాల్కనీలో నుంచి బట్టలు వేయడానికి అమర్చిన కర్ర రెండున్నర అడుగుల పొడవున రోడ్డుమీదకి వచ్చి వుంది. దానిమీద  పడ్డాడు శివాజీ. అతని బరువుకి ఆ కర్ర కూడా విరిగింది.

రెండవ అంతస్తు దగ్గర వైరు, మొదటి అంతస్తులోని కర్ర పైనుంచి పడుతున్న శివాజీ శరీరానికి తాకడంతో అతను కిందపడే వేగం కొద్దిగా తగ్గింది.

అతను రోడ్డు మీదకి చేరుకునేసరికి సరిగ్గా అదే సమయంలో దేవుడు పంపించినట్లుగా వచ్చింది ఒక లారీ. ఆ ఓపెన్ లారీనిండా కార్టన్స్.

శివాజీ ఆ కార్టన్స్, వాటిలోని సేనిటరి నేప్‌కిన్స్ మీద పడ్డాడు. లోపల మెత్తటి సేనిటరి నేప్‌కిన్స్ ఉండటంతో ఎలాంటి దెబ్బ తగల్లేదు. పైనుంచి ఒక మనిషి పడటం గమనించిన డ్రైవరు అప్రయత్నంగా బ్రేక్ వేసి లారీ ఆపాడు. అలా ఆపడంతో లారిలో పడ్డాడు శివాజీ. లేకపోతే లారి దాటి వెళ్ళిపోయి, సిమెంటు రోడ్డుమీద పడివుండేవాడు.

పైనుంచి ఇదంతా చూస్తున్న కుమారస్వామి, అతని అనుయాయులు కొద్ది క్షణాలు నిశ్చేష్టులయ్యారు. లారీ డ్రైవరు లారీ ఆపి కిందకి దిగడం, అదే సమయంలో తేరుకుంటున్న శివాజీ నెమ్మదిగా ఆ కాటన్స్ మధ్యనుంచి లేచి కిందకి దిగడం గమనించి అరిచాడు కుమారస్వామి.

"కమాన్! పారిపోదాం రండి."

మెట్లమీద నుంచి కిందకు వచ్చి లిఫ్ట్ ఎక్కారు ముగ్గురూ.

లిఫ్టు కిందకి వెళుతుంటే "ఇడియట్! మళ్ళీ తప్పించుకున్నాడు" పళ్ళు పటపట కొరికాడు కుమారస్వామి.

లారీ డ్రైవరు తెల్లబోయి చూశాడు. లారీలో నుంచి దిగుతున్న శివాజీని. శివాజీ కిందకి దిగి గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు.

"పైనుంచి పడింది నువ్వేనా?" అడిగాడూ ఆ డ్రైవరు ఆశ్చర్యంగా.

"అవును థాంక్స్ బ్రదర్. సమయానికి నీ లారీ రాకపోతే చచ్చిపోయి వుండేవాడిని."

"అంత ఎత్తు నుంచి అసలు ఎందుకు దూకావు?"

"దూకలేదు. నన్ను తోశారు."

"ఎవరు?"

"కుమారస్వామి వాళ్ళు."

డ్రైవరు పైకి ఎక్కి ఏదైనా డేమేజ్ జరిగిందేమోనని చెక్ చేశాడు. కార్టన్ విరిగింది తప్ప నేప్‌కిన్స్‌కి ఎలాంటి డేమేజి జరగపోవడంతో దగ్గరకు వచ్చి సలహా యిచ్చాడు.

"పోలీసులకి రిపోర్టు యివ్వు"

మొదటి అంతస్థు బాల్కనీలో పడుకున్న ఒక అమ్మాయికి కనిపించింది. పైనుంచి అరుస్తూ ఎవరో కింద పడటం, కర్రకు తగలడంతో అది విరగడం. ఆమె ఆశ్చర్యంగా లేచి బాల్కనీ పిట్టగోడమీదనుంచి తొంగి చూసింది.

కింద లారీ వెళ్ళిపోవడం, ఒక వ్యక్తి రోడ్డు మీద పైకి  చూస్తూ నిలబడి వుండటం గమనించింది. అతన్ని గుర్తుపట్టగానే ఆమె ఆశ్చర్యం ఇంకాస్త ఎక్కువైంది.

"పవన్!" అరిచింది.

గబగబా కిందకి పరుగెత్తింది. క్షణాల్లో రోడ్డుమీద నిలుచున్న శివాజీ దగ్గరికి చేరుకుంది.

"పవన్! నువ్వేనా?"

"కాదు, నా పేరు శివాజీ. మీరు...ఓ...అద్రిజ" గుర్తుపట్టాడు అతను.

"పైనుంచి కింద పడింది నువ్వేనా?" అడిగింది అతని శరీరాన్ని పరిశీలనగా చూస్తూ.

"నేనే."

"ఎందుకు దూకావు? అసలు పైన ఎవరింటికి వెళ్ళావు?"

"నేను దూకడం కాదు. హంతకులు నన్ను చంపడానికి మళ్ళీ ప్రయత్నం చేశారు?" ఎగ్జైటింగ్‌గా చెప్పాడతను.

"ఓ కుమారస్వామి నిన్ను వదల్లేదన్నమాట భయంగా అడిగింది అద్రిజ.

"అవును."

"ఇప్పుడర్థమైంది నీ పేరు శివాజి అని ఎందుకన్నావో, ఈ షాక్‌తో నీకు మతి చలించి వుండాలి."

"షాక్ కాదు, మతి చలించడమూ కాదు. నా పేరు శివాజీ. పవన్ నా సవతి తమ్ముడు."

"విరిగిన కర్ర మా ఇంట్లోదే" ఒంగి రోడ్డుమీద ఉన్న కర్రని అందుకుని చెప్పింది.

సరిగ్గా ఆ సమయంలో ఆ అపార్ట్‌మెంటులో నుంచి బయటకు దూసుకు వచ్చింది ఒక కారు. అది వస్తున్న వేగం, అది తమ వైపు రావడం చూసి ఇద్దరూ అప్రయత్నంగా రోడ్డుమీద ఉన్న పోస్ట్‌బాక్స్ పక్కకి తప్పుకున్నారు.

"వద్దు. ఇంకెవరో వున్నారు" అరిచాడు కుమారస్వామి.

ఆ కారు క్షణాల్లో మయమైంది.

"వాళ్ళే" శివాజీ భయంగా చెప్పాడు.

"మా ఇంటికి వెళదాం రా"

"ఊహూ. అదిగో ఆటో. దాన్లో వెళతాను. రేపు ఉదయం పవన్ ఇంటికి రా. అన్నీ వివరంగా చెప్తాడు."

ఆటో దగ్గరికి రాగానే ఆపి, ఆటోలో ఎక్కాడతను.

"గుడ్‌నైట్ అద్రిజ."

"గుడ్ నైట్ పవన్."

ఒంగి అతన్ని ముద్దు పెట్టుకోబోయింది. కాని అంతలోనే వెనక్కి స్ప్రింగ్‌లా వెళ్ళి చెప్పింది. "నో... నువ్వు పవన్‌వి కాదు."

"అదేగా నేను చెప్పేది కూడా. నా పేరు శివాజీ."

"అంతా నాకు అయోమయంగా వుంది" చెప్పింది అద్రిజ భయంగా చూస్తూ.

"రేపు పవన్‌ని కలిస్తే నీకు అతను అంతా వివరంగా చెప్పాక ఏదీ అయోమయంగా వుండదు.

"గుడ్‌నైట్ మిస్టర్ శివాజీ" చెప్పింది.

"ఒక్కమాట.. నేను పవన్‌ని కాదని ఎలా తెలుసుకున్నావు?" అడిగాడతను.

"పవన్ చెవి వెనుక పుట్టుమచ్చ లేదు. మీకు ఉంది.

"గుడ్. గుడ్‌నైట్."

ఆటో ముందుకి కదిలింది. అద్రిజ తన అపార్ట్‌మెంటూ వైపు నడిచింది. వెడుతున్న ఆ ఆటో వైపు చూస్తూ చెప్పాడు కుమారస్వామి "కమాన్!"

చీకట్లో పక్క సందులో ఆగి వున్న తమ కారుని ఆ ఆటో వెళ్ళేవైపు పోనిచ్చాడు సూరి.

పవన్ తన చేతి గడియారం వైపు మరోసారి చూసుకున్నాడు. అర్ధరాత్రి దాటి గంటన్నర అవుతోంది. ఉదయం అనగా బయటికి వెళ్ళిన శివాజీ ఇంకా రాలేదు.

అతనికి ఎంతో ఆందోళనగా వుంది. శివాజీని కుమారస్వామి చంపాడా? లేదా అన్న ఆదుర్దాతోపాటు శివాజీ మరణించాడేమోనన్న ఆందోళన కూడా చోటు చేసుకుంది.

ఆదిలక్ష్మమ్మకి కూడా నిద్రపట్టలేదు. కుమారస్వామికి శివాజీ బలి అయితే తాను పావనికి ఏం చెప్పాలి? అని ఆలోచిస్తోంది.

వాళ్ళ ఆలోచనలను భగ్నం చేస్తూ టెలిఫోను మోగింది. రిసీవరు అందుకోవడానికి హాల్లోకి వచ్చాడు పవన్. అప్పటికే ఆదిలక్ష్మమ్మకూడా ఫోను దగ్గరికి వచ్చింది."

"హలో" చెప్పాడు రిసీవరు అందుకుని పవన్.

"అద్రిజని" వినిపించింది అవతలనుంచి.

"నువ్వా? ఇప్పుడు  చేసావేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు.

శివాజీ అనే బ్రదర్ ఒకడు నీకు వున్నాడని నాకు ఇంతకాలం చెప్పలేదా?"

"చెప్పలేదు. నేను ఇంట్లో లేనప్పుడు నువ్వు చూసింది అతనినే."

"అతనిమీద కుమారస్వామి మళ్ళీ హత్యాప్రయత్నం చేశాడు."

"అలాగా! నీకెలా తెలుసు?"

"మా బిల్డింగ్ మీద నుంచి తోసి చంపే ప్రయత్నం చేశాడు. కాని లక్కీగా సేనిటరీ నేప్‌కిన్స్ లారీ సమయానికి రావడం, శివాజీ దాంట్లో పడటంతో ఏమీ కాలేదు అతనికి"

"ఇప్పుడు ఎక్కడున్నాడు?"

"ఆటోలో మీ ఇంటికే బయలుదేరాడు. ఇంకొక పావుగంటలో రావచ్చు. ఎంత ఆశ్చర్యం. చూడటానికి అచ్చం మీలానే వున్నాడు. చెవి వెనక వున్న ఆ పుట్టు మచ్చ ఒక్కటే తేడా."

"అవును. మిగిలిన విషయాలు రేపు. గుడ్‌నైట్."

"గుడ్‌నైట్."

రిసీవరు పెట్టేసి ప్రశ్నార్థకంగా తనవైపు చూస్తున్న తల్లితో చెప్పాడు.

"శివాజీని మళ్ళీ చంపడానికి ప్రయత్నించారు. నాలుగు అంతస్థుల బిల్డింగ్ మీద నుంచి తోసేశారు. కాని మళ్ళీ లక్కీగా బతికి బయటపడ్డాడు. ఆటోలో ఇంటికి బయలుదేరాడు."

"భగవంతుడా!" ఒకే ఒక్క ముక్క ఆదిలక్ష్మమ్మ ఉచ్చరించినా, అందులో ఆవిడ మనసులోని బాధ, సంతోషం, ఆదుర్దా అన్నీ ప్రతిఫలించాయి.

క్షణాల్లో కుమారస్వామి కారు శివాజీ ఎక్కి వెళుతున్న ఆటోని క్రాస్ చేసి రోడ్డుకి అడ్డంగా ఆగింది. అందులోనుంచి బిలబిలమంటూ దిగుతున్న వాళ్ళని చూడగానే శివాజీకి జరగబోయేది అర్థం అయింది. దాంతో ఆటోలోనుంచి దిగి పరుగెత్తసాగాడు.

అతని వెంట పడ్డారు తాతాచారి, సూరి, రాములు. శివాజీ ఎక్కువ దూరం పరిగెత్తకుండానే పొట్టుబడ్డాడు వాళ్ళకి. కుమారస్వామి డ్రైవ్ చేసి దగ్గరకి తెచ్చిన కారు ఎక్కించారు శివాజీని. వెనుక సీటు ముందు భాగంలో కింద పడుకోబెట్టారు.

కారు బయలుదేరాక కుమారస్వామి చెప్పాడు శివాజీతో

"నాలుగోసారి నువ్వు చావు తప్పించుకోవడం.."

అందరి కాళ్ళు అతని శరీరాన్ని నొక్కిపెట్టి వుంచాయి.

"ఎక్కడికి?" అడిగాడు ముందు సీటులో కూర్చుని కారు డ్రైవ్ చేస్తున్న సూరి.

కుమారస్వామి కొద్ది క్షణాలు ఆలోచించాడు.

"మెడకి రాయి కట్టి నీళ్ళలో పడేద్దాం" చెప్పాడు.

"ఆ చోటు నాకు తెలుసు. చెప్పక్కర్లేదు" చెప్పాడు రాములు వెనక సీటులోనుంచి.

కారు సెక్రటేరియట్ పక్కనే వున్న రిక్లమేషన్ రోడ్డువైపు బయలుదేరింది. ఆ ప్రదేశంలో గతంలో నలుగురిని ట్యాంక్‌బండ్‌లోకి తోసి చంపారు.

"ఈసారి నీ చావు తప్పదు. ఈసారి మాత్రం నీ చావు తప్పదు" తనకి తాను ఎన్యూరెన్స్ ఇచ్చుకుంటున్నట్లుగా బయటికే చెప్పసాగాడు కుమారస్వామి.

33

ప్రతి ఐ ఏ ఎస్, ఐ పి ఎస్ ఆఫీసర్‌కి తాను సమర్ధుడైన ఉద్యోగిగా తమ పేరు పేపర్లో చూసుకోవాలని ఉంటుంది. అయితే అలాంటి అవకాశాలు అందరికీ రావు.

హైదరాబాద్ నగర పోలీస్ కమీషనరుకి కూడా ప్రింట్ మీడియాలో ప్రసిద్ధి పొందాలన్న కోరిక వుంది. అందుకు ఆయన ఎలాంటి అవకాశాన్నీ వదులుకోడు. టాస్క్‌ఫోర్స్ వాళ్ళు విదేశీ కరెన్సీ పట్టుకున్నా హై రేంకింగ్ వేశ్యలని పట్టుకున్నా, బంగారం బిస్కెట్లనో, నకిలీ పాలప్యాకెట్లనో, లేదా నకిలీ మద్యాన్నో పట్టుకున్నా ఆ విషయాన్ని పత్రికలకు తెలియచేసే ప్రెస్ కాంఫరెన్స్‌లో అతను వుంటాడు. ఆ వివరాలు స్వయంగా పోలీస్ కమీషనరే అందిస్తాడు. 'తన ఆధ్వర్యం 'లో ఫలానా డి ఎస్ పి, లేదా ఫలానా సర్కిల్ ఇన్స్‌పెక్టర్స్ పట్టుకున్నారని చెప్తాడు. నిజానికి వాళ్ళు పట్టుకున్న తర్వాత కాని ఆయనకు ఆ సమాచారం తెలియకపోయినా.

నగర పోలీస్ కమీషనరు నేర పరిశోధనలో కొత్త కొత్త పథకాలు ఆలోచిస్తుంటాడు. కొంత పేపరు పబ్లిసిటీ కోసం, కొంత సిన్సియర్‌గా నేరస్థులను పట్టుకోవడం కోసం, లేదా నేరాలను నిరోధించడం కోసం అలా చేస్తుంటాడు.

ఆ రాత్రి ఆయనకి మెరుపులంటి ఆలోచన ఒకటి వచ్చింది. హైదరాబాద్‌లోని వివిధ పోలీస్ స్టేషన్స్‌లో సిబ్బంది సమర్ధతను ఎలర్ట్‌నెస్‌ని పరీక్షించడం కోసం ఒక పని చేశాడు.

రాత్రి ఒకటి ఇరవై అయిదు నిముషాలకు వైర్‌లెస్‌ద్వారా ఒక మెసేజ్ పంపించాడు.

"8706 నెంబరు గల చాక్లెట్ రంగు మారుతి కారులో రహస్యంగా మాదక ద్రవ్యాలు రవాణా వుతున్నాయి. దాన్ని అన్వేషించి పట్టుకోండి."

నిజానికి ఆ నంబరు కారులో స్వయానా పోలీస్ కమీషనరే ప్రయాణిస్తున్నాడు.

ఆ మెసేజ్ రాగానే హుటాహుటిన అన్ని  పోలీస్ స్టేషన్ల సిబ్బంది అందుబాటులో వున్న వాహనాలలో ఆ కారు కోసం వెదకసాగారు. ఆ రంగు గల ప్రతి మారుతి కారునేకాక, వాళ్ళు కారు మార్చి ఉండవచ్చునన్న పోలీసు బుద్ధితో ఆలోచించి రోడ్డుమీద వెళుతున్న ఇతర వాహనాలను కూడా ఆపి తనిఖీ చేయసాగారు.

సెక్రటేరియట్ పక్క రోడ్డు మీదకి వస్తున్న కుమారస్వామి చాక్లెట్ రంగు మారుతి కారుని లిబర్టి సర్కిల్ దగ్గర ఆపింది ఒక పోలీస్ బృందం. కారు లోపలికి టార్చిలైట్లు వేసి చూస్తూ అరిచారు –

"దిగండి అంతా."

అంతా కారు దిగారు.

"ఎవరు మీరు? ఎక్కడికి వెళుతున్నారు?" గద్దిస్తూ అడిగాడు సర్కిల్ ఇన్స్పెక్టర్.

కుమారస్వామి అనుయాయులు కలవరపడ్డా, కుమారస్వామి చిరునవ్వుతో చెప్పాడు.

"నా పేరు కుమారస్వామి. ఎక్స్ ఎం ఎల్ ఏని. కృష్ణా ఒబెరాయ్ హోటల్కి వెడుతున్నాం."

"అవును సార్. ఈయన ఎక్స్ ఎం ఎల్ ఏ. ఈయన కూడా ఎం ఎల్ ఏ" పవన్గా భ్రమించిన శివాజీని చూసి అతని పార్టీ పేరు కూడా చెప్పాడు ఎస్.ఐ.

"ఏమిటి సంగతి?" అడిగాడు కుమారస్వామి.

"ఒక కారులో మాదక ద్రవ్యాలు రవాణా అవుతున్నాయని సమాచారం వచ్చి ... మీరు వెళ్ళండి సార్"

"నేను మాత్రం కృష్ణా ఒబెరాయ్కి వెళ్ళను" చెప్పాడు శివజీ స్థిరంగా.

అందరూ అతనివైపు చూశారు శివాజీ హెచ్చరికగా చూశాడు కుమారస్వామి వైపు.

"ఓకే.. ఓకే నువ్వు మనసు మార్చుకుంటే నేను చేసేదేమీలేదు" భుజాలెగరేసి చెప్పాడు కుమారస్వామి.

మిగిలిన వాళ్ళు కారు ఎక్కి వెళ్ళిపోయారు.

శివాజీ చెప్పాడు ఎస్ ఐ తో –

"దయచేసి నన్ను మా ఇంటి దగ్గర దింపుతారా?"

"ఎస్ సర్!"

కారు కొద్ది దూరం వెళ్ళాక పళ్ళు పటపట కొరికాడు కుమారస్వామి. "రాస్కెల్ మళ్ళీ తప్పించుకున్నాడు."

"పోలీస్ కమీషనర్‌కి థాంక్స్ చెప్పాలి. ఈయన ఈ పని చేసి ఉండకపోతే మన శివాజీ ఈ పాటికి ట్యాంక్‌బండ్ నీళ్ళలో వుండేవాడు" చెప్పింది ఆదిలక్ష్మమ్మ.

"శివాజీ పోలీసులు అక్కడ వున్నప్పుడే కుమారస్వామి తనని కిడ్నాప్ చేశాడని ఎందుకు రిపోర్టు ఇవ్వలేదు?" చిరాగ్గా అడిగాడు చలపతి."

"ఇప్పుడు నువ్వు ఉన్నంత నిశ్చలంగా లేడు బాబాయ్ శివాజీ. అప్పుడే ఒకసారి చావు తప్పించుకున్న షాక్, తనని ఇంకొకసారి చంపే ప్రయత్నం చేస్తున్న షాక్‌తో బుర్ర సరిగ్గా పనిచేయలేదట. ముందర వాళ్ళబారినుంచి తప్పించుకుంటే చాలు అన్న ఆలోచనే వచ్చిందట." చ్పాడు పవన్.

వాళ్ళ బ్రేక్‌ఫాస్ట్ ముగిసే సమయానికి వచ్చి వాళ్ళతో జాయిన్ అయ్యాడు శివాజీ. రాత్రి ఆలస్యంగా పడుకోవడం వల్ల నిద్ర చాలక మొహం ఫ్రెష్‌గా లేదు అతనికి.

"రాత్రి టూకీగా చెప్పావు. బాబాయ్ కూడా వింటారు అసలేం జరిగిందో వివరంగా చెప్పు" అడిగింది ఆదిలక్ష్మమ్మ.

శివాజీ తనని నెహ్రూ జూ పార్కులో కిడ్నాప్ చేసినప్పటినుంచి జరిగింది వివరించాడు.

బిల్డింగ్‌మీద నుంచి కిందపడే సందర్భం, తిరిగి కిడ్నాప్ జరిగిన సందర్భం టెన్షన్‌తో విన్నది ఆదిలక్ష్మమ్మ.

"అంత ఎత్తునుంచి పడ్డావు, డాక్టర్ దగ్గరికి ఒకసారి వెళ్ళివస్తావా?" అడిగింది ఆదిలక్ష్మమ్మ.

చిన్నగా నవ్వి తల అడ్డంగా వూపాడు శివాజి.

"అంతా బాగానే వుంది. అవసరంలేదు"

"మెత్తటి వాటిమీద పడ్డాడు కాబట్టి బ్రతికిపోయాడు. ఫ్రాక్చర్స్ లాంటిదేమయినా అయితే ఆ ప్రాంతం వాచి వుండేది" చెప్పాడు చలపతి.

"ఆ కుమారస్వామి తన పట్టు వదటంలేదన్నమాట" భయంగా చెప్పింది ఆదిలక్ష్మమ్మ.

"వాడు పరమనీచుడు. తాచుపాముకి విషం ఎంత సహజమో, వాడికి ద్వేషం అంత సహజం" పవన్ కోపంగా చెప్పాడు.

"నేను రేపు బొంబాయి వెళదామనుకుంటున్నాను" నెమ్మదిగా చెప్పాడు శివాజీ.

ఎవరూ బదులు మాట్లాడలేదు.

"అమ్మకి మొన్నటి విషయాలు తెలిసి కంగారు పడుతోంది"

"అలాగే! టిక్కెట్ రిజర్వ్ చేయిస్తాను" చెప్పాడు చలపతి.

"మీరంతా మా ఇంటికి ఒకసారి రావాలి" మనస్ఫూర్తిగా ఆహ్వానించాడు శివాజి.

"అలాగే నాయనా!"

"ఈ కుమారస్వామి గొడవ లేకపోతే ఎలక్షన్ కేంపైన్‌లో నిన్ను కూడా ఉపయోగించుకోవాలనుకున్నాను" చెప్పాడు పవన్.

"ప్లీజ్ టేక్ కేర్ ఆఫ్ యువర్ సెల్ఫ్. అసలు పోలీసులకి రిపోర్టు ఇచ్చినా ఎందుకు పట్టించుకోరు?" అడిగాడు శివాజీ.

"పొలిటీషియన్స్ 'నన్ను ఫలానా వాళ్ళు చంపాలనుకుంటున్నారు. వాళ్ళని పట్టుకోండి. నాకు పోలీస్ రక్షణ యివ్వండి ' అనడం ఆంధ్రప్రదేశ్‌లో పరిపాటే. పోలిసులు ఇరుపక్షాల మాటలు నమ్మరు. అందులో నిజం వుంటే ఒకరు చావడం జరిగిన సందర్భాలు కూడా లేకపోలేదు. కానీ బలమైన సాక్ష్యం లేకుండా నోటిమాటని పోలీసు అధికారులు పట్టీంచుకోరు. పొలిటికల్ గేంలో ఈ ఆరోపణలు ఒక భాగంగా తీసుకుంటారంతే."

"టూ బేడ్."

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in